# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

ములుగు | సంపుటి : 04 | సంచిక : 188 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 4 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ‘ 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## గణతంత్ర వేడుకలకు ఎన్‌సీసీ ముమ్మర సన్నద్ధత

ఢిల్లీ క్యాంప్‌లో 2,406 మంది క్యాడెట్లు

ఈ ఏడాది క్యాంప్‌లో 898 మంది బాలికల భాగస్వామ్యం

గతంతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల



05

## నకిలీ ఉద్యోగుల గుట్టురట్టు

### కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విభాగాల్లో 15వేల మంది గుర్తింపు

డూప్లికేట్ ఉద్యోగుల ఏరివేతతో ప్రభుత్వ నిధులకు అడ్డుకట్ట

తెలంగాణ బడ్జెట్ 2026-27 కసరత్తు ప్రారంభం



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27కు రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు మొదలైందని తెలంగాణ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా చెప్పారు. కేంద్ర బడ్జెట్ కూడా చూస్తామని కేంద్ర పథకాలను పూర్తి స్థాయిలో వాడుకుంటున్నామన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన

మిగతా 2 లో

## జాతీయ స్థాయికి చేరిన యూట్యూబర్ అన్వేష్ వివాదం

అన్వేష్ పై చర్యలకు సిద్ధమైన మహిళా కమిషన్

మహిళా వ్యతిరేక కంటెంట్‌పై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్

2





## ముంచెత్తిన పొగమంచు





### హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో 18 విమానాలు దారి మళ్లింపు

ఫిబ్రవరి 10 వరకు డీజీసీఏ 'ఫాగ్' హెచ్చరికలు

జాతీయ రహదారులపై స్తంభించిన ట్రాఫిక్

2

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి. పొగ మంచు కారణంగా జాతీయ రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. తాజాగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దట్టమైన పొగమంచులో కూరుకుపోయింది. ఈ క్రమంలోనే ఎయిర్‌పోర్టులో డీజీసీఏ ఫాగ్ సీజన్ హెచ్చరికలు జారీ చేసింది.



## కృష్ణా జలాల్లో చుక్క నీటిని కూడా వదులుకోం

తెలంగాణ హక్కులను కాపాడి తీరుతాం

అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం

.. వివరాలు 2లో



## కాంగ్రెస్ తీరు రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం

పాత లేఖను బయటపెట్టిన హరీశ్ రావు

.. వివరాలు 2లో



## మేడారం భక్తులకు టోల్ ఫీజు మినహాయింపు..?

సోషల్ మీడియా విమర్శలపై మంత్రి కోమటిరెడ్డి క్లారిటీ

తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని విజ్ఞప్తి

.. వివరాలు 2లో



02

## ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

- అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు తావులేదు
- అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు నిధుల విడుదల
- సింగరేణి ప్రాంత పట్టాల పంపిణీపై కేబినెట్ నిర్ణయం

## కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ కల్యాణ్



02

- రూ. 35.19 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- టీటీడీ నిధులతో భక్త నివాసం, దీక్షా మండపం
- వారాహి యాత్ర నాటి హామీ నెరవేర్పు

## ఎన్నికల సేవల్లో నవశకం




ఒకే గొడుగు కిందకు 40 సేవలు

అందుబాటులోకి ఈసీఐనెట్ యాప్

న్యూ ఢిల్లీ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారత దేశ ఎన్నికలకు సంబంధించి ఒకే యాప్‌లో 40 రకాల సేవలు అందించేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జనవరి 10 వరకు సూచనల గడువు ఓటర్లకు మెరుగైన సేవలు అందించేందుకు 'ఈసీఐనెట్' యాప్ రూపొందించారు. కాగా దీనిని మరింత యూజర్ ఫ్రెండ్లీగా మార్చేందుకు భారత ఎన్నికల సంఘం పౌరుల

మిగతా 2 లో

## మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ



డీజీపీ ఎదుట లొంగిపోయిన అగ్రనేత బర్సె దేవా, రాజిరెడ్డి

కనుమరుగవుతున్న కేంద్ర కమిటీ

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా తెలంగాణ డీజీపీ

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

- గంజాయి తాగుతూ పట్టుబడ్డ ఎమ్మెల్యే కుమారుడు
- నానక్‌రామ్ గూడలో ఈగల్ టీమ్ తనిఖీలు
- సుధీర్ రెడ్డికి గంజాయి పరీక్షల్లో పాజిటివ్

తెలంగాణ బ్యూరో, జనవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో సంచలన ఘటన చోటుచేసుకుంది. గంజాయి తీసుకుంటూ ఎమ్మెల్యే కుమారుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌లోని నానక్‌రామ్

మిగతా 2 లో



## సాగునీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

### ఎమ్మెల్యేల గైర్హాజరీపై సీఎం సీరియస్

5

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.



5

## కూనంనేని వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

ప్రధాని మోడీకి క్షమాపణ చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్

క్షమాపణ చెప్పకుంటే చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి




# కేయు "కామన్ మెస్ "లో గోల్‌మాల్..?

**అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?**

**అధికారుల మౌనంపై విద్యార్థుల ఆగ్రహం**

**త్వరలోనే వెలుగులోకి అక్రమార్కుల చిట్టా**


కాకతీయ కామన్ మెస్‌లో భారీ కుంభకోణం..?

11 రోజులు సెలవులు ఉన్నా..పూర్తి నెల బిల్లులా..!

ఆధారాలతో సహా విద్యార్థుల ఆందోళన

బినామీల జేబుల్లోకి బిల్లులు..

విచారణకు విద్యార్థుల డిమాండ్

విద్యార్థుల డిమాండ్లు.. హెచ్చరిక





అధికారులను ప్రశ్నిస్తున్న విద్యార్థులు

హనుమకొండ కేయు, జనవరి 03 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ మెస్ నిర్వహణలో భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కామన్ మెస్ బిల్లులు, అడ్డ కూలీల నియామకం, పనుల కేటాయింపులో లక్షల రూపాయల అవినీతి జరుగుతోందని విద్యార్థి సంఘాలు ఆధారాలతో సహా గళమెత్తుతున్నాయి. యూనివర్సిటీ ఉన్నతాధికారుల కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా, పారదర్శక చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్దల హస్తం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఆగస్టు నెల కామన్ మెస్ బిల్లుల్లో జరిగిన అక్రమాలను విద్యార్థులు రిజిస్ట్రార్, డెవలప్మెంట్ ఆఫీసర్ వంటి ఉన్నతాధికారుల సమక్షంలోనే ఆధారాలతో బయటపెట్టారు. గత 10 నెలల బిల్లులు సీల్ లేకుండా హాస్టల్ ఆఫీసులో ఉండటం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటని విద్యార్థులు నిలదీస్తున్నారు.

### మద్యం మత్తులో విధులు - భద్రత ప్రశ్నార్థకం

ఓ మెస్ కేర్ టేకర్.. విధుల్లో ఉండగానే మద్యం సేవించడం, అదే స్థితిలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించడం యూనివర్సిటీ క్రమశిక్షణను దిగజార్చుతోంది, ఈ పరిస్థితుల ఆధారంగా.. విద్యార్థుల భద్రతను గాలికొదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నించిన విద్యార్థి నాయకులను కాళ్ళు, చేతులు విరగగొడతాం అని సిబ్బంది బెదిరించడం వర్సిటీలో నెలకొన్న భయానక వాతావరణానికి అద్దం పడుతోందని విద్యార్థులు ఆరోపిస్తూ.. ఆవేదన చెందుతున్నారు.

### విద్యార్థుల డిమాండ్లు:

- నిష్పక్షపాత విచారణ: ఈ మొత్తం అవినీతి నెట్‌వర్క్‌పై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపించాలి.
- క్రిమినల్ కేసులు: దొంగ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ధనాన్ని కాజేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.
- సస్పెన్షన్: బెదిరింపులకు పాల్పడిన, మద్యం సేవించి విధులకు హాజరైన కేర్ టేకర్ ని తక్షణమే సస్పెండ్ చేయాలి.
- వీసీ జోక్యం: వైస్ ఛాన్సలర్ కర్నాటి ప్రతాపరెడ్డి స్వయంగా స్పందించి, వ్యవస్థను ప్రక్షాళన చేయాలి.
- యూనివర్సిటీ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించకపోతే, ఈ పోరాటాన్ని న్యాయపరంగా ముందుకు తీసుకెళ్తామని, భారీ ఎత్తున ఉద్యమిస్తామని విద్యార్థి లోకం హెచ్చరిస్తోంది. కాగా అన్ని ఆధారాలతో అతి త్వరలో తీన్మార్ దినపత్రికలో వరుస కథనాలతో కాకతీయ యూనివర్సిటీలో అవినీతికి పాల్పడిన అక్రమార్కుల చిట్టా తేట తెల్లంకానుంది.




## ఎన్నికల సేవల్లో నవశకం

మొదటి పేజీ తరువాయి

నుంచి సూచనలను ఆహ్వానించింది. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని 'సబ్మిట్ ఏ సజెషన్' ట్యాబ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలపాలని కోరింది. ఈ సూచనలు ఇచ్చేందుకు జనవరి 10, 2026 వరకు గడువు విధించింది. వచ్చిన సూచనలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేసిన తర్వాత ఈ నెలాఖరులోనే ఈ ప్లాట్‌ఫారమ్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు.

### ఒక్క యాప్.. 40 సేవలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓటర్ హెల్ప్‌లైన్, సివిజిల్, సక్షమ్ వంటి దాదాపు 40కి పైగా విభిన్న యాప్‌లు, వెబ్‌సైట్‌లను ఏకం చేస్తూ ఈ 'ఈసీఐనెట్'ను ఒకే గొడుగు కిందకు తెచ్చారు. గత ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా పరీక్షించిన ఈ యాప్ ఓటింగ్ శాతం గణాంకాలను త్వరగా అందించడంలో, పోలింగ్ ముగిసిన 72 గంటల్లోనే ఇండెక్స్ కార్డులను ప్రచురించడంలో విజయవంతమైందని ఈసీ వెల్లడించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ డిజిటల్ వ్యవస్థను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది.







## "ముంచెత్తిన పొగమంచు"

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి. పొగ మంచు కారణంగా జాతీయ రాహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. తాజాగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దట్టమైన పొగమంచులో కూరుకుపోయింది. ఈ క్రమంలోనే ఎయిర్‌పోర్టులో డీజీసీఏ ఫాగ్ సీజన్ హెచ్చరికలు జారీ చేసింది. ఫిబ్రవరి 10 వరకు ఈ హెచ్చరికలు అమల్లో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు దట్టమైన పొగమంచు కారణంగా మెజారిటీ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే 18 జాతీయ, అంతర్జాతీయ విమానాలను దారి మళ్లించారు.

## నకిలీ ఉద్యోగుల గుట్టురట్టు

మొదటి పేజీ తరువాయి

ఆయన పలు కీలక విషయాలు వెల్లడించారు. గడిచిన రెండు నెలలుగా రియల్ ఎస్టేట్ గ్రోత్ ఉందని రిజిస్ట్రేషన్ టాక్స్ పెరిగిందన్నారు. రియల్ ఎస్టేట్‌లో 12 శాతం వృద్ధి కనిపించిందని, మైనింగ్‌లో 22 శాతం గ్రోత్ ఉందన్నారు. ఎక్సైజ్ ఆదాయం 9 నెలలుగా స్థిరంగా ఉందని చెప్పిన ఆయన మైనింగ్ లో లీకేజీలు తగ్గినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లలో పెద్ద ఎత్తున డూప్లికేట్ ఉద్యోగులు ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాజాగా సందీప్ సుల్తానియా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలు సేకరణ పూర్తి అయ్యిందని రాష్ట్రంలో 15 వేల మంది గ్యాప్ వచ్చిందని తెలిపారు. కాగా కొన్ని ఏజెన్సీలు, ఆయా శాఖల్లోని కొందరు అవినీతి అధికారుల అండదండలతో పెద్ద ఎత్తున కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్లలో నకిలీ ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈ వ్యవహారంపై సర్కార్ దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను ఆధార్ కార్డుతో లింక్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వేల సంఖ్యలో ఫేక్ ఉద్యోగులు ప్రతి నెలా శాలరీల పేరుతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న విషయం బట్టబయలైంది.

## కృష్ణా జలాల్లో చుక్క నీటిని కూడా వదులుకోం

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి బొట్టు కూడా వదలమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ కృష్ణా నది జలాలపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ వాళ్లు శాసనసభకు రాకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ విషయంలో వాళ్లేదో గొప్పగా చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం కృష్ణా గోదావరి నది జలాల నుండి తెలంగాణకు రావాల్సిన నీటి విషయంలో ఒక్క టీఎంసీ కాదు కదా ఒక్క చుక్క నీటిని కూడా వదిలిపెట్టదని స్పష్టం చేశారు. చుక్క నీరు కూడా ఎవరికి పోదని తెలంగాణ ప్రజలకు హామీ ఇస్తున్నామని అన్నారు. కృష్ణా నది జలాల్లో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో కొందరు రైతులు ఆదారపడి ఉన్నారని చెప్పారు. నీటి హక్కులు కాపాడటంలో గత ప్రభుత్వం కంటే తాము సమర్థవంతంగా పని చేశామన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం చేసింది గత ప్రభుత్వమేనని ఆరోపించారు.

## మేడారం భక్తులకు టోల్ ఫీజు మినహాయింపు..?

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు టోల్ ఫీజు అంశం చర్చనీయాంశంగా మారింది. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో హైదరాబాద్ విజయవాడ హైవే మీద టోల్ ఫీజు రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం పట్ల తెలంగాణ వాదుల వైపు నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్లో వైపు వెళ్లే వాహనాలక కోసం టోల్ చార్జీల మినహాయింపు కోరిన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల విషయంలో ఎందుకు లాంటి ఆలోచన చేయడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మేడారంజాతరకు వెళ్లే భక్తులకు కూడా టోల్ ఫీజు విషయంలో మినహాయింపును పరిశీలిస్తున్నామని అన్నారు. టోల్ ప్లాజాలు కేంద్రం ఆధీనంలో ఉన్నాయని అందువల్ల సంక్రాంతికి టోల్ ఫీజుపై గడ్కరీకి లేఖ రాశామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారాలను పట్టించుకోనన్నారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా ఈఏడాది మేడారం మహాజాతర2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం



మొదటి పేజీ తరువాయి

గూడలో శనివారం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాకు చెందిన జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి గంజాయి తీసుకుంటూ దొరికిపోయారు. అదుపులోకి తీసుకున్న అనంతరం గంజాయి టెస్టులు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో సుధీర్ రెడ్డిని స్థానిక పోలీస్ స్టేసన్‌కు తరలించి విచారించారు. అనంతరం డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలోనూ సుధీర్ రెడ్డిపై రెండు డ్రగ్స్ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు న్యూఇయర్ వేళ ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఈగల్ బృందం సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో డ్రగ్స్ తీసుకుంటూ ఎనిమిది మంది పోలీసులకు చిక్కారు. మొత్తం 14 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా 8 మందికి పాజిటివ్ వచ్చింది. అందరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# ల్యాండ్ స్కేపింగ్ సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



తాడ్వాయి, జనవరి 03 (తీన్మార్ న్యూస్): శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతర ఆలయ పరిసరాలలో ల్యాండ్ స్కేపింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శనివారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ఆలయ పునరుద్ధరణ పనులు,ల్యాండ్ స్కేపింగ్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆలయ పరిసరాలలో ల్యాండ్ స్కేపింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, భక్తులను ఆకట్టుకునే విధంగా సహజ సిద్ధ ప్రకృతి వనంలా ఉండే విధంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో ప్రాకారపు రాతి స్తంభాలపై బ్రాకెట్స్ లను, ప్రధాన ఆర్చి రాతి స్తంభాలపై పిటి బీమ్స్ వెంటనే అమర్చాలని అన్నారు. జాతర సమీపిస్తున్న తరుణంలో నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేయాలని, వనదేవతల సందర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని, ఆలయ ప్రాంగణ పరిసరాలలో, జంపన్న వాగు మరియు ఆర్టీసీ బస్ స్టాండ్ లలో ఎప్పటికప్పుడు వ్యర్థాల సేకరణ, పరిశుద్ధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య, దేవాదాయ శాఖ అధికారి వీరస్వామి, ఎఫ్ డి ఓ రమేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాయకపోడ్ జిల్లా అధ్యక్షులుగా బిష్కుల సమ్మయ్య



ములుగు జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్) వేంకటాపూర్ మండలం అడవి రంగాపూర్ గ్రామానికి చెందిన బిష్కల సమ్మయ్యను నాయకపోడ్ ములుగు జిల్లా అధ్యక్షులుగా ఆ సంఘం ప్రకటించారు. ములుగు జిల్లా ములుగు నియోజక వర్గం ఏర్పడినప్పటి నుండి సరియైన సామాజిక ఆర్థిక రాజకీయ గుర్తింపు లేదని నాయకపోడ్ లను చైతన్య పరిచి నాయక పోడ్ లకు ఫెడరేష న్ ఏర్పాటు చేసి నాయకపోద్ లను విద్యా ఉద్యోగ రాజకీయ సామాజిక రంగాలలో తగిన ప్రాతినిధ్యం వహించే విధంగా కృషిచేస్తానని సమ్మయ్య ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ములుగు గిరిజన నియోజక వర్గంగా ఉన్నప్పటికీ రెండు సామాజిక వర్గాలే అధికారం చలాయిస్తూ నాయకపొడులను చిన్న చూపుచూస్తున్నారని సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు నాయక పొడ్ లు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచి రాజకీయ పోరాటంలో తమ వాటా కోసం ప్రయత్నించాలని నిర్ణయించు కున్నట్లు సమ్మయ్య తెలిపారు.

# విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఐఏఎస్ ఆదేశాలు ప్రకారం, నెల్లికుదురు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి శనివారం సందర్శించి విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్శనలో పాఠశాలలో అందిస్తున్న విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అలాగే మానసిక ఆరోగ్య, క్రీడలు, వ్యాయామం లాంటి తదితర అంశాలు పై కూడా విద్యార్థులకు నిత్య అవగాహన చేయాలని తెలిపారు. అధికారులు విద్యార్థులు మరియు సిబ్బందికి వ్యాధులు ప్రబలకుండా నీటి పరిశుభ్రత పాటించడం, పాఠశాలలో నీరు నిల్వ ఉండనివ్వకపోవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, శుభ్రమైన ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. అలాగే, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనపడితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, స్వీయచికిత్స చేయరాదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించబడగా ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారు జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను, వాటన్నిటిని అధిగమించి తాను చదువుకోవడంతో పాటు మొదటిసారిగా సమాజంలో మహిళ లు చదువుకోడానికి ప్రోత్సహించి పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం మరొక విశిష్ట అతిథి ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని, వారి స్ఫూర్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని, మహిళా సాధికారత దిశగా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం జిల్లాలోని 21 మంది మహిళా ఉపాధ్యాయులకు సన్మానాలు చేశారు. అనంతరం ఇదే వేదికపై జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ద్వారా పదవ తరగతి విద్యార్థుల కోసం తయారు చేయబడినటువంటి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, సంసిద్ధత కార్యక్రమం సంబంధించినటువంటి బుక్లెట్ లు అతిథులచే ఆవిష్కరించడం జరిగింది. స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ ద్వారా రాష్ట్ర స్థాయికి ఎంపిక కాబడిన ఆరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంపత్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, బిసి నాయకులు చింత నిప్పుల బిక్షపతి, డిసిఇబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, ఏసీజీఈ వినోద్ కుమార్, కార్యాలయ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ సతీష్ చంద్రమానస్, కోఆర్డినేటర్లు బుర్ర రజిత, గుల్ల పెల్లి సాంబయ్య, అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్ భద్రత మాసోత్సవం 2026

**జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారత దేశం అభివృద్ధి చెందుతున్న దేశాలలో నాల్గవ స్థానంలో ఉన్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల పరంగా దురదృష్టవశాత్తు మొదటి స్థానంలో నిలుస్తోందని జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని తెలిపారు. శనివారం 5 ఇంక్లైన్ లో రహదారి భద్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పెరిగినప్పటికీ, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల ప్రమాదాలు కూడా అధికమవు తున్నాయని పేర్కొన్నారు. 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా సుమారు 4,80,000 రోడ్డు ప్రమాదాలు జరగగా, అందులో 1,70,000 మంది మృతి చెందారని, మిగిలిన వారు తీవ్రంగా గాయపడి క్షతగాత్రులుగా మారి కుటుంబాలకు, సమాజానికి భారంగా మారుతున్నారని తెలిపారు. జరిగిన మొత్తం రోడ్డు ప్రమాదాలలో సుమారు 80 శాతం మంది యువతే ఉన్నారని, వీరిలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి కుటుంబాలను పోషించే వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో యువత మరణించడం వల్ల దేశానికి ఏటా సుమారు 3.14 శాతం జిడిపి నష్టం వాటిల్లుతోందని వివరించారు.

రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత 37 సంవత్సరాలుగా రోడ్ సేఫ్టీ వీక్ నిర్వహించినప్పటికీ ప్రమాదాలు తగ్గకపోవడంతో, భారత ప్రభుత్వం దీనిని జాతీయ రోడ్ భద్రత మాసోత్సవంగా మార్పు చేసి, ప్రతి సంవత్సరం జనవరి నెల మొత్తం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ మాసోత్సవం ద్వారా రోడ్డు ప్రమాదాలను వరకు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రహ వీర్ ను అమలు చేస్తోందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన అనంతరం గాయపడిన క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25,000 నగదు ప్రోత్సాహకం అందించడంతో పాటు, ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఏఎంవిఐ సుందర్ లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలా అనిముత్యం సావిత్రిబాయి పూలే




**ఏభిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్**

హన్మకొండ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): హన్మకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ లో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 126 జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి ఏభిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అనంతరం ఏభిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు స్త్రీ అభ్యున్నతికి పోరాడిన మహోన్నత నాయకురాలు సంఘసంస్కర్త భారత దేశంలో మహిళల విద్య కోసం కుల వివక్షకు పితృ సౌమ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత సావిత్రి భాయ్ పూలే అని మంద నరేష్ అన్నారు మహిళల కోసం దేశంలో మొట్టమొదటి సారి పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను అందించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అట్టడుగు వర్గాల మహిళలకోసం వారి దగ్గరికి చదువు చెప్పడానికి వెళ్తున్న క్రమంలో అగ్రవర్ణాల వాళ్ళు సావిత్రి భాయ్ ని వెళ్ళద్దోని అంటరాని వాళ్లకు చదువు నేర్పించవద్దని ఆమె మీద పేడ గుడ్లు కొట్టిన కానీ పట్టించుకోకుండా అణగారిన వర్గాల మహిళలకు చదువు నేర్పించిన గొప్ప వ్యక్తి సావిత్రి భాయ్ పూలే అని మంద నరేష్ అన్నారు. సావిత్రిబాయి పూలే ఆలోచన విధానాన్ని, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోని మహిళలు అన్ని రంగాలలో ఎదగాలన్నారు. పూలే దంపతుల ఆశయాలకోసం అట్టడుగు ప్రజలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏభిఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు అడ్డ రాజేష్ ప్రధాన కార్యదర్శి రాయరాల నరసింహ ఉపాధ్యక్షులు బండారి శ్రీనివాస్ పోతురాజ్ ఉదయ్ ఏభిఎస్ఎఫ్ కెయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్ప భరత్ జిల్లా నాయకులు చంటి కిరణ్ అరుణ్ సురేష్ వెంకటేష్ సాయి ప్రసన్న పల్లవి శోభ నవ్య ఐశ్వర్య అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చదువు నేర్పిన యోధురాలు సావిత్రి బాయి పూలే

## మాలిలకు ఎస్టీ హోదా కోసం ఢిల్లీ దాక పోరాటం సాగిస్తం

## కోసిని పాఠశాలలో శ్రమదానం చేసిన ప్రవీణ్ కుమార్



ఆసిఫాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారతదేశంలో మహిళలందరికీ చదువు నేర్పింది సావిత్రిభాయి పూలేనని,ఆధిపత్య వర్గాలు వ్యతిరేకించినా, దాడులు చేసినా వెనక్కి తగ్గకుండా మహిళలకు చదువు నేర్పేందుకు ముందుకు కదిలారని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ రోజు సావిత్రిభాయి పూలే 195వ జయంతి సందర్భంగా కోసిని గ్రామంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సావిత్రి భాయి పూలే అంటే చదువు,చదువు అంటే పూలే అని తెలిపారు. చదువుతోనే సమాజ మార్పు సాధ్యమని నమ్మి పూలే దంపతులు చదువు కొరకు జీవితాంతం కృషి చేశారన్నారు. మహిళలు, పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించడమే పూలేకు మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు. సావిత్రిభాయి పూలే కేవలం మాలిలకు మాత్రమే కాకుండా సబ్బండ వర్గాలకు చదువు నేర్పిందని పేర్కొన్నారు. సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా కోసిని గ్రామ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల పిల్లలకు మంచి ఆట స్థలం, పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. మన ఊరు మన బడి పథకం కింద కోసిని పాఠశాలకు 13 లక్షల ఫండ్ వచ్చిందని, కానీ పాఠశాల అభివృద్ధి మాత్రం అనుకున్న విధంగా జరగలేదన్నారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పాఠశాలకు సున్నం వేయించి త్వరలోనే ఆట స్థలం ఏర్పాటు చేసి,ఆట వస్తువులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కోసిని పాఠశాలకు ఉత్తమ పాఠశాలగా అభివృద్ధి చేస్తామన్నారు. కేసిఆర్ ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే పేరుతో వందల గురుకుల పాఠశాలలు స్థాపించి, విద్యార్థులు నాణ్యమైన చదువు అందించేందుకు కృషి చేశారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పిల్లలను గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష రాయించాలని కోరారు. మాలిలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ చాలా కాలంగా ఉందని,వారిని ఎస్టీ జాబితాలో చేర్చడానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు తెలిపిందన్నారు. ఎస్టీ జాబితా చేర్చేందుకు అవసరమైతే ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ లో సమావేశం పెట్టి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అందుకోసం మాలి కులస్థులందరూ కలిసి కట్టుగా ఉద్యమించాలన్నారు. నందిగూడ గ్రామంలో సావిత్రి భాయి పూలే విగ్రహాన్ని ముఖ్య అతిథిగా హాజరై డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామ నాయకులతో కలిసి జెండావిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు,బిఆర్ఎస్ అసెంబ్లీ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, సీనియర్ ఉద్యమకారులు కొంగసత్యనారాయణ, కోసిని సర్పంచ్ పుల్లభాయి, ఉప సర్పంచ్ సాజిద్,వంజీరి సర్పంచ్ గౌత్రే లక్ష్మి గోపాల్,వార్డు సభ్యులు,రేగులగూడ సర్పంచ్, ఉప సర్పంచ్, వసాకె హన్మంత్, రవిందర్, మహిళ నాయకులు వరలక్ష్మి, కమల, షబానా, ఫాతిమ, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి





## ఎర్రబెల్లి దయాకర్ రావు,చల్లా ధర్మారెడ్డి

పరకాల, జనవరి 03 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో పరకాలగడ్డపై గులాబీ జెండా ఎగరవేయడమే లక్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పరకాల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ లోని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో పరకాల పట్టణ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ చేసిన సేవలను ప్రజలకు గుర్తుచేయాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియచేయాలని సూచించారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే పరకాలలో ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయకు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, సోలార్ లైట్స్ పంపిణీ



వెంకటాపూర్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): వెంకటాపూర్ మండలం, తొర్రిచింతలపాడు గోతికోయగూడెంలో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, సోలార్ లైట్స్, పౌష్టిక ఆహార వస్తువులను వెంకటాపూర్ సర్పంచ్ మామిడిశెట్టి కోటి ముఖ్యఅతిథులుగా హాజరై గోతికోయ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మిలకూరి ఐలయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు చెన్నోజు శ్రీనివాస్, ఉపసర్పంచ్ అన్నబోయిన రాజు, వార్డ్ మెంబెర్ బానోత్ సునీల్,మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎస్కె జాకీర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కాగిత రవీ, నాయకులు బిక్షపతి, యుగేందర్, చేరాలు, గాజుల శ్రీనివాస్, అనుముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


# కూనంనేని వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీలో ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై జరిగిన చర్చ సందర్భంగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారానికి దారితీశాయి. ఉపాధి హామీ పథకం వంటి పేదల సంక్షేమ పథకాల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ ప్రధాని తన మనస్తత్వాన్ని మార్చుకోవాలని కూనంనేని వ్యాఖ్యానించారు. "మైండ్‌ను టెస్ట్ చేయించాలంటూ" చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు తీవ్రంగా మండిపడుతున్నారు. తాజాగా ఈ అంశంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. కూనంనేని సాంబశివ రావు వ్యాఖ్యలను ఖండించారు. సభ ఉన్నది రాజకీయ చర్చకే కానీ వ్యక్తిగత దూషణలకు కాదని హితవు పలికారు. ప్రధాని మోడీకి కూనంనేని క్షమాపణ చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేకపోతే కూనంనేని సాంబశివ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కూనంనేని వ్యాఖ్యలపై శుక్రవారం సభలోనూ గందరగోళం నెలకొంది. కూనంనేని సాంబశివరావు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తక్షణమే తొలగించాలని వారు పట్టుబట్టారు.

# ఆటో డ్రైవర్ల అరెస్టు అప్రజాస్వామికం

## మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని రెండేళ్లు అయినా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ అన్న ల జీవితాలు ఆగమైతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆటో డ్రైవర్ల జీవనోపాధి కష్టమైందని తెలిపారు. ఆటో అన్నలకు ఇస్తామన్న 12 వేల నగదు సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని విమర్శించారు. ఆటో నడిపితే ఇల్లు గడవకపోవడంతో వందలాదిమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ అమలు మరిచి, వారి డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్న ఆటో డ్రైవర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్ట్ చేసిన వెంటనే ఆటో డ్రైవర్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు

# నేటి సమాజానికి సావిత్రిబాయి పూలే ఆదర్శనీయం




హనుమకొండ కేయు, జనవరి 03 (తీన్మార్ న్యూస్): మహిళలకు విద్య అందించడం కోసం ఎన్నో అవమానాలను, ఆటంకాలను ఎదుర్కొని బాలికలకు విద్యను అందించి పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయులు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి ఆదర్శనీయమని, ఆ మహనీయురాలును ఆదర్శంగా తీసుకోవాలని కేయూ పరిశోధకులు జాక్ అధ్యక్షులు డి. తిరుపతి పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే 195వ, జయంతి సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ వద్ద విద్యార్థి జేఏసీ, స్కాలర్స్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు.ఆధునిక భారత చరిత్రలో ధృవతార, ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమకారిణి అయిన సావిత్రి బాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, సమాజంలో మహిళల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో విద్యార్థినిలు, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, కేయూ జాక్ వైస్ చైర్మన్ కేతపాక ప్రసాద్, కన్వీనర్ కందికొండ తిరుపతి, కార్యదర్శి జనగాం రాజారాం, కోశాధికారి రేగుల నరేష్, చందు,నిడికొండ మౌనిక, పాటు నాయకులు అశోక్, సాయితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



పరకాల, జనవరి 03 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపాలిటీ ఒకటో వార్డు సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ సంఘసంస్కర్త, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ సాధికారత కోసం విశేషంగా కృషిచేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినారు. మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, స్థానిక మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి గణం నివాళులు అర్పించినారు. విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంచినారు. మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ దళితులు, మహిళల హక్కుల కోసం అవిరాళంగా పోరాడిన దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించిన మహనీయురాలని కొనియాడినారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ జి.ఎబ్బీ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్ జరుగుతున్న సమయంలో సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సరైన సంఖ్యలో లేకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యేలకు ఫోన్ కాల్స్

ప్రజెంటేషన్ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో లేకుండా లాబీల్లో తిరగడాన్ని సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. ఇది మంచి పద్ధతి కాదని వ్యాఖ్యానించిన సీఎం, వెంటనే అందరినీ సభలోకి పిలిపించాలని విప్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సీఎం సలహాదారులు ఎమ్మెల్యేలకు ఫోన్ కాల్స్ చేసి సభలోకి రావాలని సూచించారు. ఆ తరువాత ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు హాల్‌లోకి చేరుకున్నారు. శాసనసభ కార్యకలాపాల పట్ల సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించినట్లు సమాచారం.

# మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా లొంగిపోయారు. దేవాతో పాటు తెలంగాణ కీలక నేత కంకణాల రాజిరెడ్డి కూడా పోలీసులు ఎదుట లొంగిపోయారు. మరో 48 మంది మావోయిస్టులు వీరి బృందంలో ఉన్నారు. తాజాగా మావోయిస్టుల లొంగుబాటు కారణంగా 41 మంది కేంద్ర కమిటీ సభ్యులతో ప్రారంభమైన మావోయిస్టు పార్టీ ఇప్పుడు నలుగురికి చేరింది. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఒక్క రాష్ట్ర కమిటీ సభ్యుడు మాత్రమే మిగిలారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతో వీరంతా లొంగిపోయారు. మావోయిస్టు పార్టీకి ఆయుధాలు సమకూర్చడంతో బర్సె దేవా కీలకంగా పనిచేశారు. మావోయిస్టు పార్టీలో అంతర్గత కలహాలు ఎక్కువయ్యాయి. వీరంతా అంతర్గత కలహాలకు తోడు ఆరోగ్య సమస్యలతో లొంగిపోయారు అని చెప్పుకొచ్చారు. ఈ లొంగుబాటుతో పీజీఎల్‌ఏ బెటాలియన్ మొత్తం కొలాప్స్ అయ్యింది. లొంగిపోయిన మావోయిస్టులకు నిబంధనల ప్రకారం రివార్డులు అందిస్తాం. తక్షణ సాయంగా రూ.25వేల చెక్కులను అందిస్తాం. ఉన్న 66 మందిలో లొంగిపోయిన వారు కాకుండా మిగిలిన వారంతా మరణించారు' అని తెలిపారు. కాగా, బర్సె దేవా మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీలో దేవా కీలకంగా ఉన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ బలగాల వ్యవహారాలను చూస్తున్నారు. బర్సె దేవా లొంగిపోవడంతో ఇక కేంద్ర కమిటీలో కేవలం నాలుగు మాత్రమే మిగిలి ఉన్నారు. ఇక, హిడ్మా, బర్సె దేవా ఛత్తీస్‌గఢ్‌లో ఒకే గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మావోయిస్టులకు ఆయుధాల సరఫరాలో దేవా కీలక పాత్ర పోషించారు. శుక్రవారం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి బర్సె దేవా బృందాన్ని పోలీసులు తీసుకొచ్చారు.

# గణతంత్ర వేడుకలకు ఎన్‌సీసీ ముమ్మర సన్నద్ధత

### ఢిల్లీ క్యాంప్‌లో 2,406 మంది క్యాడెట్లు

### ఈ ఏడాది క్యాంప్‌లో 898 మంది బాలికల భాగస్వామ్యం

### గతంతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల



న్యూ ఢిల్లీ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా 8 వందల 98 మంది బాలికలు సహా మొత్తం 2 వేల 406 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ రిపబ్లిక్ డే క్యాంప్ 2026లో పాల్గొంటారు. గత సంవత్సరంతో పోలిస్తే అన్ని రాష్ట్రాలలో బాలికల క్యాడెట్ల సంఖ్య పెరుగుదలను ఇది చూపిస్తుంది. ఈ సంవత్సరం ఈవెంట్ కోసం క్యాంప్ గత నెల 30న ప్రారంభమైంది.

ఎన్‌సీసీ రిపబ్లిక్ డే క్యాంప్ 2026 పై న్యూఢిల్లీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్‌సిసి డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వాట్స్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ నుండి 127 మంది క్యాడెట్లు, లడఖ్‌తో పాటు, ఈశాన్య ప్రాంతం నుండి 131 మంది క్యాడెట్లు పాల్గొంటున్నారని తెలిపారు. యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద 25 స్నేహపూర్వక విదేశీ దేశాల నుండి క్యాడెట్లు మరియు అధికారులు కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ సందర్భంగా, క్యాడెట్లు కాల్పులు జరపడం మరియు ఒక కంటింజెంట్‌లో కవాతు చేయడం వంటి వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటారు, ఇది ఈ నెల 28న ప్రధానమంత్రి ర్యాలీతో ముగుస్తుంది. ఎన్‌సీసీ బలాన్ని హైలైట్ చేస్తూ, లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వాట్స్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ల సంఖ్య 17 లక్షల నుండి 20 లక్షలకు పెరిగిందని, ఇది 40 శాతం బాలిక క్యాడెట్‌లు అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో 75 వేల మంది క్యాడెట్లు పాల్గొన్నారని కూడా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సమయంలో, పౌర పరిపాలనకు సహాయం చేయడానికి మరియు స్వచ్ఛంద రక్తదానంతో సహా వైద్య సహాయం అందించడానికి క్యాడెట్‌లను నియమించారు.

# ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు





హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వచ్చే మార్చి-ఏప్రిల్‌లో రాష్ట్రంలో మరోవిడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. గతంలో మాదిరిగా ఎన్నికలప్పుడే హామీలు అమలు కాకుండా మరో ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని చెప్పారు. శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ మాట్లాడిన మంత్రి పొంగులేటి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పింక్ కలర్ షర్ట్ ఉంటేనే ఇండ్లు ఇచ్చేవారని కానీ మేము రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు నిధులు ఇస్తున్నామని కేసీఆర్ దత్తత తీసుకున్న వాసాల మర్రిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మేం కట్టించామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించే రూ.5 లక్షల్లో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నిధులు ఇస్తున్నామన్నారు.

### వచ్చే కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటాం:

సింగరేణి ప్రాంతాల్లో 76 జీవో ప్రకారం పట్టాల పంపిణీ పెండింగ్‌లో ఉందని దీనిపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి పట్టాలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించి మొండి గోడలతో వివిద దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 వేల ఇండ్లు ఉన్నాయని వీటి విషయంలో కేబినెట్ లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని పెద్ద పట్టణ ప్రాంతంలో స్థలాలు లేని పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, హౌసింగ్ సెక్రటరీతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యను సైతం పరిష్కరిస్తామన్నారు. అటవీ ప్రాంతాల్లో గతం నుంచి నివసించే స్థలాల్లో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తో ఇబ్బందులు ఉన్నాయనేది వాస్తవం అని ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

### గతంలో కమిషన్ల కోసమే

బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోణంలోనే ఇళ్లను పంపిణీ చేసిందని ఆరోపించారు. మేము గిరిజన ప్రాంతాల్లో 12, 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెంచులు అందరికీ మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చా మన్నారు. భేషజాలకు పోకుండా అందరికీ నిధులు ఇస్తున్నామన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూంలు పూర్తి చేస్తున్నామని మేం వచ్చేనాటికి 133 కాలనీల్లో 36 వేల ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని వీటి కోసం రూ.744 కోట్లు కేటాయిం చామని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు.

# కాంగ్రెస్ తీరు రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ఉత్తమ్ జీ.. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా గతంలో సీఎల్పీ ఆధ్వర్యంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతకం చేసిన లేఖలను పోస్ట్ చేశారు. అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము" అని అదే ఉత్తమ్ కుమార్ రెడ్డి, నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాల్లో ప్రెజెంటేషన్‌కు సిద్ధపడటం, రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని హరీశ్ రావు విమర్శించారు. ఈ ఉత్తరంపై నేటి ఉప ముఖ్యమంత్రి అయిన భట్టి విక్రమార్క, పద్మావతి కూడా సంతకాలు చేశారని తెలిపారు.

### ఈ ఒక్క ఉత్తరం చాలు

ఈ ఒక్క ఉత్తరం చాలు కాంగ్రెస్ పార్టీ అనైతికతను, ద్వంద్వ ప్రమాణాలను బట్టబయలు చేయడానికి అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి లాంటి మాటలు వల్లెవేస్తారు. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారు ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజం అని ఆయన అన్నారు. స్పీకర్‌ని బీఏసీ సమావేశంలోనూ, ఉత్తరం ద్వారా కూడా, అధికార పక్షానికి ప్రెజెంటేషన్‌కు అనుమతి ఇస్తే, బీఆర్ఎస్‌కూ అదే విధంగా అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అయినప్పటికీ, ఆ అభ్యర్థనను తిరస్కరించారన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని అని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత, కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ, రాజ్యాంగానికి తూట్లు పొడవడాన్ని తన "మార్పు"గా చూపిస్తోందని అన్నారు. ఆ "మార్పు" అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ కల్యాణ్


తెలంగాణ బ్యూరో, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ఆంజనేయస్వామి అందరి దేవుడు అని, విశ్వాంతర్యామి అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అంజనేయ స్వామి ఓ ప్రాంతానికి మాత్రమే దేవుడు కాదన్నారు. తమ ఇలవేల్పు ఆంజనేయ స్వామికి సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గాన్ని కూడా సాకారం అందిస్తామన్నారు. అందరూ పూనుకుంటే ఆంజనేయస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. రామభక్తులు అనుకుంటే కానిదంటూ ఏదీ ఉండదన్నారు. త్వరలోనే కొండగట్టు ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు ఆంజనేయస్వామి ఆదేశంగా భావిస్తున్నానని చెప్పారు. బలమైన సంకల్పంతో చేపట్టిన పనికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తగిన సహకారం అందించినందుకు ఆనందంగా ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు.

### వసతి సముదాయం, దీక్షా మండపానికి శంకుస్థాపన

కాగా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.35.19 కోట్లతో వసతి సముదాయం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలకు పవన్ కల్యాణ్ శనివారం శంకుస్థాపనలు చేశారు. 2024 ఎన్నికల ముందు వారాహి యాత్ర ప్రారంభ సమయంలో కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. అప్పుడు ఆలయంలో వసతి సముదాయం, దీక్షా మండపం అవసరాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి ఆలయ అధికారులు, పండితులు తీసుకెళ్లారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వస్తున్న భక్తులు, ఆంజనేయస్వామి మాల ధరించి వస్తున్న స్వాములు పడుతున్న ఇబ్బందులను పవన్□కి తెలిపారు. దీంతో ఈ విషయాన్ని టీటీడీ దృష్టికి పవన్ కల్యాణ్ తీసుకెళ్లారు. ఈ మేరకు టీటీడీ ధార్మిక మండపాల నిర్మాణాల నిమిత్తం వెచ్చిస్తున్న నిధుల నుంచి రూ.35.19 కోట్లను కొండగట్టు ఆలయంలో సత్రం, దీక్షల విరమణ మండపాలను నిర్మించేలా కేటాయించింది. ఈ నిధులతో మొత్తం 96 గదుల వసతి సముదాయం, 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా అతి పెద్ద మండపం అందుబాటులోకి రానున్నాయి. ఈ పనులకు పవన్ కల్యాణ్ శనివారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు వేదపండితులు శాస్త్రోక్తంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం చేయించారు.

# జాతీయ స్థాయికి చేరిన "యూట్యూబర్ అన్వేష్ వివాదం



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ) చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. మహిళలను కించపరిచేలా ప్రవర్తించడం, అసభ్యకర కంటెంట్‌ను ప్రసారం చేయడం మరియు సామాజిక విలువలకు భంగం కలిగించడం వంటి ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది.

వరుస వివాదాలు - వెల్లువెత్తిన ఫిర్యాదులు

ప్రపంచ యాత్రికుడిగా గుర్తింపు పొందిన అన్వేష్, గత కొంతకాలంగా వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుపై చేసిన వ్యాఖ్యలు, మహిళలను వస్తువుల్లా చిత్రీకరిస్తూ తన వీడియోల్లో అసభ్యకరంగా మాట్లాడటంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మహిళా కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది.

### కమిషన్ గుర్తింపులోని ప్రధాన అంశాలు:

మహిళా వ్యతిరేక కంటెంట్: మహిళల గౌరవానికి భంగం కలిగించేలా, వారిని కించపరిచేలా వీడియోలు రూపొందించడం.

బాలల హక్కుల ఉల్లంఘన: చిన్నారులపై ప్రభావం చూపే అభ్యంతరకర కంటెంట్‌ను తన ఛానల్‌లో ప్రసారం చేయడం.

భక్తుల మనోభావాలు: ధార్మిక విషయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసి భక్తుల సెంటిమెంట్లను దెబ్బతీయడం.

నైతిక విలువల పతనం: సామాజిక సమతుల్యతకు, ప్రజా నైతికతకు విరుద్ధంగా వ్యవహరించడం.

### జాతీయ మహిళా కమిషన్‌కు కేసు బదిలీ

ఈ కేసును లోతుగా పరిశీలించిన తెలంగాణ మహిళా కమిషన్, సంబంధిత వీడియో లింకులను, ఆధారాలను సేకరించింది. అయితే, సదరు ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్లు విచారణలో తేలింది. నిందితుడు అందుబాటులో లేని పక్షంలో అంతర్జాతీయ స్థాయి సమన్వయం కోసం మరియు కఠిన చర్యల నిమిత్తం ఈ కేసును జాతీయ మహిళా కమిషన్ కు సిఫార్సు చేసినట్లు కమిషన్ స్పష్టం చేసింది. మహిళల గౌరవాన్ని కాపాడటం, బాలల హక్కులను రక్షించడంలో రాజీ పడే ప్రసక్తే లేదు. సోషల్ మీడియా ముసుగులో విచ్చలవిడిగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు." అని కమిషన్ ఈ సందర్భంగా హెచ్చరించింది. ఈ పరిణామంతో అన్వేష్ యూట్యూబ్ ఛానల్ మనుగడ ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఆయనపై మరిన్ని క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది.

# రీల్స్‌లో చిక్కుకున్న రియల్ పేరెంటింగ్!

బిడ్డ ఏడ్చినా, అన్నం తినకపోయినా.. అమ్మకు ఫోన్ చేయకుండా, పేరెంటింగ్ పుస్తకం తెరవకుండా ఇన్‌స్టాగ్రామ్‌చూస్తున్నారా? చాలామంది తల్లులు తమకు తెలియకుండానే 'ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్' అనే ప్రమాదంలో చిక్కుకున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు వాళ్ల బిడ్డల పోషణ కోసం ఇంట్లో పెద్దల సలహాలు పాటించేవారు. కొన్ని సందర్భాల్లో వైద్యులను సంప్రదించేవారు. కానీ, ఇప్పుడు ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ల రీల్స్‌నే పేరెంటింగ్ పాఠాలుగా భావిస్తున్నారు.

'పేరెంటింగ్ ఇప్పుడు ప్రైవేట్ వ్యవహారం కాదు. ఓ ప్రదర్శనలా మారిందం'టున్నారు సైకాలజిస్ట్‌లు. ఎవరో ఆటవిడుపుగా చేసే రీల్స్ ఫాలో అవుతూ.. చాలామంది పేరెంట్స్ పిల్లల పెంపకాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. తరాలుగా వస్తున్న పేరెంటింగ్ సూత్రాలు కాదని, ఏ విధమైన ధ్రువీకరణలు లేని విధానాలను అవలంబిస్తూ పసివారితో ప్రయోగాలకు పాల్పడుతున్నారు.



## అబద్ధాల ప్రపంచం

ఇన్‌స్టాగ్రామ్‌లో రంగుల ప్యాన్‌కేక్‌లు, చక్కెర లేని డెజర్ట్‌లు ఉన్న హై ఎండ్ ఫుడ్ ప్లేట్‌లను చూపిస్తున్నారు. పేరెంట్స్ వాటికి ఆకర్షితులు అవుతున్నారు. అవి ఆరోగ్యంగా కనిపించడమే కాదు.. అవే హెల్తీ అని నమ్ముతున్నారు. దీంతో తమ పిల్లలకు సాధారణంగా పప్పు.. అన్నం.. రసం లాంటివి ఫీడ్ చేసే తల్లిదండ్రులు గిల్టీగా ఫీల్ అవుతున్నారట. అలాంటి హై ఎండ్ చిరుతిళ్లు పెట్టలేకపోతున్నామే అని పోల్చుకుంటూ ఒత్తిడికి లోనవుతున్నారట.

## అసలు నిజం

శిశుపోషణ కత్తి మీద సాములా ఉంటుంది. ఇక ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే తల్లిదండ్రులు నిత్యం అష్టావధానం చేయాల్సిందే! కానీ, ఇన్‌స్టా పేరెంటింగ్ దీనికి పూర్తి విరుద్ధం. ఇక్కడి ఇన్‌ఫ్లూయెన్సర్లు పర్ఫెక్షన్‌ను మాత్రమే చూపిస్తుంటారు. ఇది నార్మల్ పేరెంట్స్‌లో పోటీని సృష్టిస్తున్నది. తమ పిల్లల్నీ అలాగే చూసుకోవాలని తాపత్రయపడేలా చేస్తున్నది.

## ఎక్స్‌పర్ట్‌కామెంట్

సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ జనరలైజ్డ్ స్టేట్‌మెంట్స్‌గా ఉంటుంది. ఈ సూచనలు.. ఇంట్లో పెద్దలు, వ్యక్తిగత వైద్యుల సలహాలకు ప్రత్యామ్నాయంగా భావించొద్దు.

## కనెక్టివిటీ కట్

ప్రతి తల్లికీ తన బిడ్డతో సహజసిద్ధమైన కనెక్టివిటీ ఉంటుంది. దాన్ని కాదని ఇన్‌స్టా టిప్స్ విపరీతంగా పాటిస్తూ ప్రకృతి ధర్మంగా బిడ్డతో ఉండే బంధాన్ని చాలామంది తల్లులు కోల్పోతున్నారు. అంటే, ప్రతిదానికీ సోషల్ మీడియా చూస్తూ, సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇది తల్లీబిడ్డల బంధానికి అత్యంత ప్రమాదకరం.

ఒత్తిడి: నిరంతరం పర్‌ఫెక్ట్‌గా ఉండాలనే తపనతో.. చాలామంది సహజత్వానికి దూరమవుతున్నారు. దీంతో ఒత్తిడికి గురవుతున్నారు.

సమయం వృథా: ప్రతి దానికి స్క్రోల్ చేయడం వల్ల బిడ్డతో గడపాల్సిన క్వాలిటీ టైమ్ కోల్పోతున్నారు. దీంతో ఈ ఒత్తిడి కేవలం తల్లిదండ్రులపైనే కాదు, పిల్లలపైనా పడుతున్నది.

పిల్లలతో డిస్‌కనెక్ట్: తల్లిదండ్రులు ఫోన్‌తో అతిగా ఇంటరాక్ట్ కావడం వల్ల.. బిడ్డతో నాణ్యమైన నేచురల్ కమ్యూనికేషన్ చేయలేకపోతున్నారు. ఈ మార్పు తల్లీబిడ్డల మధ్య ఉండే సృజనాత్మక, భావోద్వేగ పూరితమైన రిలేషన్‌ని తగ్గిస్తుంది.

ప్రైవసీ కోల్పోవడం: తమ వ్యక్తిగత విషయాలను అతిగా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడం వల్ల బిడ్డ ప్రైవసీని తెలియకుండానే బహిర్గతం చేస్తున్నారు.

సింపుల్‌గా చెప్పాలంటే.. పిల్లల పెంపకం అంటే ఒక రీల్ చేయడం కాదు, అది ఒక రియల్ జర్నీ. బాధ్యతతో కూడిన పేరెంటింగే మీ బిడ్డలకు శ్రీరామరక్ష.



# మంచు వాకిట.. బౌద్ధం

హిమగిరుల్లో దౌళాధర్ పర్వతశ్రేణులు ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. ధవళ వర్ణంలో మెరిసిపోయే పర్వతాలు.. ఉభయ సంధ్యల్లో అరుణ కాంతులీనుతూ దర్శనమిస్తాయి. ఈ పర్వతాల చెంతనున్న కాంగ్డా లోయ మరో అద్భుతం. కాంగ్డా జిల్లా కేంద్రమైన ధర్మశాలలో అడుగడుగునా సంప్రదాయం పలకరిస్తుంది. అక్కడక్కడా ఆధునికత తొంగిచూస్తుంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు కాసేపు ఆరామాల్లో ధ్యానం చేస్తారు. జలపాతాల్లో కేరింతలు కొడతారు. సరస్సుల్లో బోటు షికారు చేస్తారు. తేయాకు తోటల్లో విహరిస్తారు. కొండల్లో సాహసయాత్రకు పూనుకుంటారు.

ధర్మశాలలో బౌద్ధమతం వేళ్లూనుకున్నా.. ఇతర మతాల అనవాళ్లూ కనిపిస్తాయి. కాంగ్డా కోటలో, ధర్మశాల పరిసర ప్రాంతాల్లో హిందూ దేవాలయాలు కోకొల్లలు. పురాతమైన చర్చి అపురూప నిర్మాణం అందరినీ అలరిస్తుంది. ధర్మశాల రెండు భాగాలుగా ఉంటుంది. దిగువ ధర్మశాల వాణిజ్య కేంద్రాలు, అంగళ్లతో అతిథులకు తీరిక లేకుండా చేస్తుంది. ఎగువ ధర్మశాల ఆరామాలతో, పర్యాటక విశేషాలతో స్వాగతిస్తుంది. ధర్మశాలను అభివృద్ధి చేసిన పంజాబ్ గవర్నర్ సర్ డొనాల్డ్ మెక్డ్ పేరిట ఏర్పడిన 'మెక్డ్ గంజ్' హస్తకళలకు కేరాఫ్‌గా నిలుస్తుంది.


ధర్మశాల వచ్చే పర్యాటకులు తప్పకుండా సందర్శించే ప్రాంతం త్సుగ్లఖంగ్ కాంప్లెక్స్. బౌద్ధ ఆరామాల సమూహమిది. ఇక్కడే దలైలామా ఆవాసం ఉంటుంది. కాలచక్ర ఆలయాన్ని, టిబెటన్ మ్యూజియం కూడా సందర్శించవచ్చు. వందల మంది బౌద్ధ భిక్షువులు కనిపిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే దలైలామాను చూసే అవకాశం కలుగుతుంది.

ధర్మశాలకు 46 కిలోమీటర్ల దూరంలో కాంగ్డా లోయ సమీపంలో ఉన్న అందమైన గుహాలయం మస్రూర్. కోనేటి ఒడ్డున.. అద్భుతమైన శిల్ప సంపదతో అలరారుతున్న ఈ ఆలయం ఎల్లోరా అందాలను మరిపిస్తుంది. దీనిని ఎనిమిదో శతాబ్దంలో నిర్మించినట్టు చెబుతారు. ఇలా ధర్మశాలతో పాటు పరిసరాల్లో ఎన్నెన్నో అద్భుత విహార కేంద్రాలు ఉన్నాయి. వేసవి విడిదిగా పేరున్న ధర్మశాల.. శీతాకాలంలో మరింత మనోహరంగా దర్శనమిస్తుంది.

# 'పిల్లల' యమ డేంజర్

అప్పుడెప్పుడో ఓ సినిమాలో 'తూనీగా.. తూనీగా..' అంటూ ఇద్దరు పిల్లలు ప్రేమ గీతం పాడుకుంటే ఇష్టంగా చూశాం. సినిమాని హిట్ చేసేశాం. దాని గురించి మరిచిపోయాం. పిల్లలు మాత్రం మర్చిపోలేదు. వయసుతో సంబంధం లేకుండా ప్రేమించేయొచ్చు అని నేర్చుకున్నారు. ఏడో క్లాస్ నుంచే లవ్‌లో పడటం స్టార్ట్ చేసేశారు. ఈ తొందరపాటు అనేక సమస్యలను తెచ్చి పెట్టడం చూస్తూనే ఉన్నాం. ఈ ప్రేమల వల్ల కలిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు!

మారుతున్న జీవనశైలి, సోషల్ మీడియా ప్రభావం, పిల్లల జీవితాలపై బలంగా పడుతున్నది. పాత కాలంలో టీనేజ్ (13-19 సంవత్సరాలు) దాటిన తర్వాత ప్రేమ, ఆకర్షణ వంటి భావనలు మొదలయ్యేవి. కానీ ప్రస్తుత తరంలో కౌమార దశకు చేరుకోకముందే, అంటే 10 నుంచి 12 సంవత్సరాల వయసులోనే పిల్లలు ఒకరిపై ఒకరు ఆకర్షణ పెంచుకోవడం, 'ప్రేమ' అనే పదాన్ని ఉపయోగించడం మనం చూస్తున్నాం. ఇది సమాజంలో ఆందోళన కలిగించే అంశంగా మారుతున్నది.



ప్రధాన కారణాలు ఏమిటి?

సోషల్ మీడియా-ఓటీటీ సినిమాలు, టీవీ సిరీస్‌లు, ఇంటర్నెట్‌లో వచ్చే కంటెంట్ ద్వారా ప్రేమ, రిలేషన్‌షిప్‌ల గురించి వారికి వాస్తవానికి భిన్నమైన, అపరిపక్వమైన ఆలోచనలు కలుగుతున్నాయి. టీనేజ్ డ్రామాలు, రొమాంటిక్ కంటెంట్ చిన్న వయసులోనే రిలేషన్‌షిప్‌లు సాధారణమనే భావనను కలిగిస్తున్నాయి.

ఎదుగుదల ప్రక్రియ పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతున్నారు. దీనికి హార్మోన్ల మార్పులూ ఒక కారణం. ఇవి వారిలో ఇతరుల పట్ల ఆకర్షణను పెంచుతాయి.

కుటుంబ వాతావరణం : కొందరు పిల్లలు ఇంట్లో ఆప్యాయత లేమి, ఒంటరితనం వంటివి అనుభవించినప్పుడు, ఆ ఖాళీని నింపుకోవడానికి ఇతరులతో 'క్లోజ్' అవ్వాలని చూస్తారు.

పీర్ గ్రూప్ ప్రభావం తమ స్నేహితులు ఒకరితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు, తాము కూడా ఉండాలనే ఒత్తిడి, కోరిక పిల్లల్లో పెరుగుతుంది.

## ఇవీ చిక్కులు..

చిన్న వయసులో రిలేషన్‌షిప్‌లు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, వారి మెదడు పని తీరు కూడా మారే ప్రమాదం ఉంది.

రిలేషన్‌షిప్ ఆలోచనలు, సమస్యలు, చాటింగ్‌కు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతుంది.

బ్రేకప్‌లు లేదా చిన్న చిన్న గొడవలు కూడా వారి లేత మనసుపై పెద్ద ఒత్తిడిని, డిప్రెషన్‌ను కలిగిస్తాయి.

వారికి ప్రేమ, బాధ్యత, లైంగికత వంటి విషయాలపై సరైన అవగాహన ఉండదు. దీనివల్ల ముప్పుతో కూడిన నిర్ణయాలు తీసుకునే అవకాశం పెరుగుతుంది.

కుటుంబ సభ్యులు, పాత స్నేహితుల నుంచి దూరం పెరిగి, రిలేషన్‌షిప్‌కు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంటారు.

మెదడుపై ప్రభావం ఇలా..

కౌమారదశలో ప్రేమ, ఆకర్షణ వంటి భావాలు మెదడుపై తీవ్రమైన రసాయన, నిర్మాణపరమైన మార్పులను కలిగిస్తాయి. ఈ వయసులో మెదడు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందుతూ ఉంటుంది కాబట్టి, ఈ అనుభవాలు పిల్లల ఆలోచనలు, నిర్ణయాలు, భావోద్వేగాలపై లోతైన ముద్ర వేస్తాయి.

## డోపమైన్ వలలో..

ప్రేమలో పడినప్పుడు, ముఖ్యంగా టీనేజ్‌లో, మెదడులో డోపమైన్ అనే రసాయనం అధికంగా విడుదలవుతుంది. ఇది మెదడులోని 'రివార్డ్ సిస్టమ్'ను ఉత్తేజపరుస్తుంది. డోపమైన్ విడుదల వల్ల పిల్లలు అమితమైన ఆనందం, ఉత్సాహం అనుభవిస్తారు. ఈ అనుభూతి చాలా శక్తిమంతంగా ఉంటుంది, కొన్నిసార్లు ఇది డ్రగ్స్ వాడినప్పుడు కలిగే అనుభూతితో సమానంగా ఉంటుంది. దీనివల్ల వారు తమ భాగస్వామి గురించి పదేపదే ఆలోచించడం, వారితోనే ఎక్కువ సమయం గడపాలని కోరుకోవడం వంటి అబ్సెసివ్ ప్రవర్తన చూపవచ్చు. బంధంలో సమస్యలు వచ్చినప్పుడు లేదా విఫలమైనప్పుడు, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఇది తీవ్రమైన బాధ, నిరాశ, ఆందోళనకు దారితీస్తుంది.

## మెదడు నిర్మాణంపై..

టీనేజ్‌లో మెదడులోని రెండు ముఖ్యమైన భాగాలు వేర్వేరు వేగంతో అభివృద్ధి చెందుతాయి. లింబిక్ సిస్టమ్ భావోద్వేగాలు, ప్రేరణ, రివార్డ్‌లకు సంబంధించిన భాగం. ఇది కౌమారదశ ప్రారంభంలోనే చురుకుగా మారుతుంది. అందువల్లే, టీనేజర్లు త్వరగా, తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతారు.

ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ తార్కిక ఆలోచన, నిర్ణయం తీసుకోవడం, ప్రేరణ నియంత్రణ వంటి ఉన్నత స్థాయి ఆలోచనా సామర్థ్యాలకు బాధ్యత వహిస్తుంది. ఈ భాగం సుమారు 25-30 సంవత్సరాల వయసు వరకు పూర్తిగా అభివృద్ధి చెందదు. ప్రేమలో ఉన్నప్పుడు, మెదడులోని ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ కంటే లింబిక్ సిస్టమ్ ఆధిపత్యం వహిస్తుంది. అందువల్ల పిల్లలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాల ఆధారంగా పనిచేయడం, మంచి-చెడులను సరిగా అంచనా వేయలేకపోవడం జరుగుతుంది. మెదడు ఇంకా పరిపక్వం చెందకపోవడం వల్ల బంధాలలో వచ్చే చిన్న మార్పులు కూడా వారి మానసిక ఆరోగ్యంపై పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. విపరీతమైన ఆనందం నుంచి తీవ్రమైన నిరాశకు త్వరగా మారే అవకాశం ఉంటుంది.

## ఏం చేయాలి?

లేత ప్రేమలకు పిల్లలను నిందించడం కాదు, వారిని అర్థం చేసుకోవడం మాత్రమే సమస్య మూలాలను మారుస్తుంది.

1. స్నేహపూర్వక సంభాషణ పిల్లలతో నిత్యం మాట్లాడాలి. వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. శిక్షించడం లేదా విమర్శించడం కాకుండా, వారికి ఏమైనా సమస్య ఉంటే మీతో చెప్పుకునేంత నమ్మకాన్ని పెంచాలి.
2. అవగాహన చిన్న వయసులో కలిగే ఆకర్షణ అనేది సహజమని, కానీ అది ఇప్పుడే రిలేషన్‌షిప్‌గా మారాల్సిన అవసరం లేదని వారికి వివరించాలి. 'స్వయం-ప్రేమ', లక్ష్యాల ప్రాముఖ్యతను బోధించాలి.
3. స్క్రీన్ టైమ్‌పై నియంత్రణ పిల్లలు చూసే కంటెంట్‌ను గమనించాలి. సోషల్‌మీడియా, ఇంటర్నెట్ వాడకానికి ఒక సమయ పరిమితిని విధించాలి.
4. ఆసక్తికరమైన కార్యకలాపాలు పిల్లలను ఆటలు, సంగీతం లేదా ఏదైనా కొత్త నైపుణ్యాన్ని నేర్చుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల వారి శక్తి నిర్మాణాత్మకమైన పనుల వైపు మళ్లుతుంది.
5. లైంగిక విద్య తల్లిదండ్రులు లైంగిక విద్య గురించి మాట్లాడటానికి సంకోచించకూడదు. లైంగిక ఆరోగ్యానికి సంబంధించిన సరైన సమాచారాన్ని వారికే అందించాలి, అప్పుడే వారు తప్పుడు సమాచారం నుంచి రక్షణ పొందుతారు.

# వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్




## వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్

**న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**

**రిషబ్ పంత్‌కు బీసీసీఐ మరోసారి అవకాశం**

**పర్యటనలో మూడు వన్డేలు ఆడనున్న భారత్**

**మొదటి వన్డే జనవరి 11న వడోదరలో ప్రారంభం**




న్యూజిలాండ్‌తో త్వరలో జరిగే వన్డే సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును అధికారికంగా ప్రకటించింది. వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్ కాగా.. శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించింది. అంతేకాకుండా వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు కూడా బీసీసీఐ అవకాశం ఇచ్చింది. అయితే వన్డే సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ ఎంపికైనా.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే అతడు తుది జట్టులో ఉండి మ్యాచ్‌లు ఆడతాడు. అలాగే, హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్‌లో పది ఓవర్లు బౌలింగ్ చేయడానికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఇంకా అనుమతి పొందలేదు. ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ ఉండటంతో అతడిపై పడే భారాన్ని కంట్రోల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేర్లు లేకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే హార్దిక్‌ను ఎందుకు ఎంపిక చేయలేదనే విషయంపై బీసీసీఐ స్పష్టతనిచ్చింది. పాండ్యాను వన్డే సిరీస్‌కు దూరం పెట్టడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆయన 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్' అని బీసీసీఐ తెలిపింది. ఒక వన్డే మ్యాచ్‌లో హార్దిక్ వరుసగా 10 ఓవర్లు బౌలింగ్ చేసేంత ఫిట్‌నెస్‌తో ప్రస్తుతం లేరని, వైద్య బృందం ఆయనకు పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడానికి అనుమతి ఇవ్వలేదని సమాచారం. 2026లో జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, హార్దిక్ కీలక ఆటగాడు కాబట్టి ఆయనపై ఒత్తిడి పడకుండా విశ్రాంతిని ఇచ్చారు. బుమ్రా విషయంలో కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించారు. వెన్ను గాయం కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చారు. అంతేకాకుండా ఆయనకు వైస్ కెప్టెన్ బాధ్యతలను కూడా అప్పగించారు. అయితే ఆయన ఆడటం అనేది ఫిట్‌నెస్ రిపోర్టుపై ఆధారపడి ఉంటుంది. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఈ వన్డే సిరీస్‌లో భాగమయ్యారు. వెటరన్ పేసర్ మహ్మద్ షమీని మరోసారి సెలక్టర్లు పక్కన పెట్టారు. అలాగే దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా చోటు దక్కలేదు. భారత్‌లో న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా మూడు వన్డేలు జరుగుతాయి. మొదటి వన్డే జనవరి 11 (ఆదివారం)న వడోదరలో జరుగుతుంది. రెండో వన్డే జనవరి 14న (బుధవారం) రాజ్‌కోట్‌లో, మూడో వన్డే జనవరి 18 (ఆదివారం)న ఇండోర్‌లో జరగనుంది. ఇక టీ20 ప్రపంచకప్ 2026 కోసం ఎంపిక చేసిన జట్టే.. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆడనుంది.

**భారత జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.



# శతక్కొట్టిన హార్దిక్ పాండ్యా..

**విదర్భతో మ్యాచ్‌లో 68 బంతుల్లో సెంచరీ**

**విజయ్ హజారే ట్రోఫీలో దుమ్ములేపుతున్న పాండ్యా..**

విజయ్ హజారే ట్రోఫీలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా దుమ్ములేపుతున్నాడు. బరోడా తరుపున బరిలోకి దిగిన పాండ్యా విదర్భతో మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. కేవలం 68 బంతుల్లో అతడు సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. రాజ్‌కోట్ వేదికగా బరోడా, విదర్భ జట్లు శనివారం తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన బరోడా జట్టు.. మొదట బ్యాటింగ్‌కు దిగింది. విదర్భ బౌలర్ల ధాటికి 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అమిత్ పాసీ (0), నిత్యా పాండే (15), ప్రియాన్షు మొలియా (16), అతిత్ షేత్ (21), జితేశ్ శర్మ (9)లు విఫలం అయ్యారు. ఈ దశలో ఏడో స్థానంలో హార్దిక్ పాండ్య (133; 92 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్సర్లు) బ్యాటింగ్‌కు వచ్చాడు. తన సోదరుడు, కెప్టెన్ కృనాల్ పాండ్యా (23) పాండ్యాతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో 44 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. ఆ తరువాత వేగం పెంచిన పాండ్యా మరో 24 బంతుల్లోనే మూడు అంకెల స్కోరు చేరుకోవడం గమనార్హం. కాగా.. లిస్ట్ ఏ క్రికెట్‌లో హార్దిక్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. భారత్ తరుపున 94 వన్డేలు ఆడిన పాండ్యా వీటితో కలిపి 119 లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడాడు. 2020లో కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో 92 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇప్పటి వరకు అదే అతడికి అత్యధిక స్కోరు కాగా.. తాజా మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ ఏడో నెంబర్లో బ్యాటింగ్‌కు వచ్చాడు. అతడు క్రీజులోకి వచ్చే సమయానికి బరోడా జట్టు 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితిలో హార్దిక్ నెమ్మదిగానే ఆడాడు. తొలుత నెమ్మదిగా ఆడినా ఆ తర్వాత పాండ్య గేరు మార్చాడు. ఒక దశలో 62 బంతుల్లో అతడు చేసింది 66 పరుగులే. కానీ, పార్థ్ రేఖడే వేసిన 38వ ఓవర్‌లో హార్దిక్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతడు వరుసగా ఐదు సిక్స్‌లు, ఒక ఫోర్ (6, 6, 6, 6, 6, 4) బాదేశాడు. ఏకంగా 34 పరుగులు వచ్చాయి. దీంతో ఇదే ఓవర్లో హార్దిక్ సెంచరీ కంప్లీట్ అయ్యింది. అలా ఆ ఓవర్‌కు ముందు 62 బంతుల్లో 66 పరుగులు చేసిన పాండ్య తదుపరి 6 బంతుల్లో సెంచరీని పూర్తి చేశాడు. కాగా, లిస్ట్ ఏ క్రికెట్‌లో హార్దిక్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం.

# సంజూ శాంసన్ అద్భుతమైన సెంచరీ



కేరళ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మరోసారి తన బ్యాట్‌తో గర్జించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్‌లో తాను ఆడిన మొదటి మ్యాచ్‌లోనే అద్భుతమైన సెంచరీతో కదం తొక్కాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం టీమిండియాను ఎంపిక చేస్తున్న తరుణంలో, సంజూ చేసిన ఈ సెంచరీ ఇప్పుడు సెలక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. జార్ఖండ్‌తో జరిగిన ఈ హై-స్కోరింగ్ మ్యాచ్‌లో సంజూ క్లాస్ ఇన్నింగ్స్ ఫ్యాన్స్‌కు కనువిందు చేసింది. అహ్మదాబాద్ వేదికగా జార్ఖండ్‌తో జరిగిన ఐదో రౌండ్ పోరులో సంజూ శాంసన్ తన విశ్వరూపాన్ని చూపించాడు. జార్ఖండ్ నిర్దేశించిన 312 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేరళ ఓపెనర్ రోహన్ కున్నుమ్మల్ (124) తో కలిసి సంజూ ఇన్నింగ్స్‌ను పరిగెత్తించాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు ఏకంగా 212 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సంజూ కేవలం 90 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. మొత్తం 95 బంతులు ఆడిన సంజూ, 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 101 పరుగులు చేసి టీమ్ ఇండియా సెలక్టర్లకు గట్టి సంకేతాలు పంపాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ జట్టులో కుమార్ కుశాగ్ర విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 137 బంతుల్లో 7 సిక్సర్లు, 8 ఫోర్లతో 143 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో నిరాశపరిచినప్పటికీ, కుశాగ్ర, అనుకూల్ రాయ్ (72) పుణ్యమా అని ఆ జట్టు 311 పరుగులు చేసింది. అయితే, ఇంత పెద్ద టార్గెట్‌ను కూడా సంజూ, రోహన్ జంట చాలా సులువుగా మార్చేశారు. రోహన్ కేవలం 78 బంతుల్లోనే 11 సిక్సర్లతో 124 పరుగులు చేయడం విశేషం. సంజూ శాంసన్ ఇప్పటివరకు భారత్ తరపున 16 వన్డేలు ఆడి 510 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గమనించదగ్గ విషయం ఏంటంటే.. వన్డేల్లో సంజూ స్ట్రైక్ రేట్ దాదాపు 100గా ఉంది. 2023 డిసెంబర్‌లో చివరిసారిగా వన్డే ఆడిన సంజూ, ఆ తర్వాత టీ20ల్లో మూడు సెంచరీలు బాది భీభత్సమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో కూడా సెంచరీ సాధించడంతో, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్‌లతో పాటు మూడో వికెట్ కీపర్‌గా సంజూ పేరును సెలక్టర్లు పరిశీలించాల్సి ఉంటుంది. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం బీసీసీఐ త్వరలోనే జట్టును ప్రకటించనుంది. సాధారణంగా వన్డేల్లో పంత్, రాహుల్‌లకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. కానీ, సంజూ ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే అతడిని పక్కన పెట్టడం సెలక్టర్లకు తలకు మించిన భారమే. పైగా టాప్ ఆర్డర్‌లో ఎవరైనా సీనియర్లు విశ్రాంతి తీసుకుంటే, సంజూను ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌గానైనా జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

# బంగ్లా ఆటగాడిని రిలీజ్ చేయండి'

## కేకేఆర్‌కు బీసీసీఐ ఆదేశం




ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ వేలంలో బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ముస్తాఫిజుర్‌ను తమ జట్టు నుంచి రిలీజ్ చేయాలని కేకేఆర్‌ను ఆదేశించింది. ఒకవేళ వారు ప్రత్యామ్నాయంగా మరొక ప్లేయర్‌ను కోరితే దానికి కూడా అనుమతిస్తుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిణామాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ నిర్ణయాన్ని బీజేపీ నేత సంగీత్ సింగ్ సోమ్ స్వాగతించారు. భారతదేశంలోని 100 కోట్ల మంది సనాతనుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలని తెలిపారు. 100 కోట్ల మంది భావోద్వేగాలను తేలికగా తీసుకోలేమని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న హిందువుల విజయమని అన్నారు. సనాతనుల మనోభావాలకు విరుద్ధంగా వెళ్లకూడదని ఎస్ఆర్‌కే అర్థం చేసుకున్నారని అన్నారు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ దక్కించుకుంది. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి 65 వికెట్లు తీశాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు మొదలయ్యాయి. ఈ విషయంపై గురువారం బీసీసీఐ వర్గాలు స్పందించినట్లు వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. తాజాగా జట్టు నుంచి రిలీజ్ చేయాలని ఆదేశించింది. దీంతో కేకేఆర్ ముస్తాఫిజుర్ స్థానంలో సరైన ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఈ వివాదల వేళ తమ జట్టు ఆడే సిరీస్‌లపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కీలక ప్రకటన చేసింది. అందులో భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ఉంది. భారతతో ఆగస్టు-సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు పేర్కొంది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సి ఉండగా, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ ప్రకటించింది. మరోవైపు ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ తీసుకోవడంపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ ఎంపికపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా కేకేఆర్ సహ యజమాని షారుక్ ఖాన్‌పై ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ ఠాకూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు హత్యలు, దాడులకు గురవుతున్న పరిస్థితుల్లో అక్కడి ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం అమానుషమని అన్నారు. షారుక్ ఖాన్ దేశానికి క్షమాపణ చెప్పాలని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇలియాసి డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ ప్రకటన చేయాలని, ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తొలగించాలని ఆయన కోరారు. శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా షారుక్ ఖాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశమంతా బంగ్లాదేశ్‌పై ఆగ్రహంగా ఉందని, ఇలాంటి సమయంలో బంగ్లాదేశీ ఆటగాడు జట్టులో ఉంటే, అది షారుక్ ఖాన్‌కే ప్రమాదంగా మారొచ్చని అన్నారు. ఈ వివాదంపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ స్పందించారు. 'ముందుగా బంగ్లాదేశీ ఆటగాళ్లను ఐపీఎల్ వేలంలోకి ఎవరు అనుమతించారు? దీనికి బీసీసీఐ, ఐసీసీ సమాధానం చెప్పాలి. ఐసీసీ చీఫ్ దీనిపై స్పష్టత ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

# ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు సెంచరీలు

**రికార్డులు తిరగరాస్తున్న పడిక్కల్**

**విజయ్ హజారే ట్రోఫీలో అద్భుత సెంచరీ**



టీమిండియా తలుపు తడుతున్న మరో యువ కెరటం దేవదత్ పడిక్కల్. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్‌లో పడిక్కల్ తన బ్యాట్‌తో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. శనివారం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పడిక్కల్ మరో అద్భుతమైన సెంచరీ బాదాడు. కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే ఇది ఆయనకు నాలుగో సెంచరీ కావడం విశేషం. ఈ అసాధారణ ఫామ్ చూస్తుంటే, త్వరలో జరగబోయే న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో పడిక్కల్‌కు చోటు ఖాయమనిపిస్తోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో త్రిపురతో జరిగిన ఐదో రౌండ్ మ్యాచ్‌లో కర్ణాటక ఓపెనర్ దేవదత్ పడిక్కల్ క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (5), కరుణ్ నాయర్ (0) ఒకే ఓవర్లో అవుట్ కావడంతో జట్టు కష్టాల్లో పడింది. అయితే పడిక్కల్ ఏమాత్రం తొందరపడకుండా స్మరణ్ రవిచంద్రన్ (70) తో కలిసి మూడో వికెట్‌కు 136 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 120 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 108 పరుగులు చేసి జట్టు 332 పరుగుల భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో పడిక్కల్ ఫామ్ చూస్తుంటే బౌలర్లు గజగజ వణికిపోతున్నారు. టోర్నీలో ఆయన జార్ఖండ్‌పై 147 పరుగులు, కేరళపై 124 పరుగులు, పుదుచ్చేరిపై 113 పరుగులు, తాజాగా త్రిపురపై 108 పరుగులు. కేవలం తమిళనాడుపై మాత్రమే 22 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. ఒకే టోర్నమెంట్‌లో వరుసగా సెంచరీలు బాదుతూ విరాట్ కోహ్లీ, పృథ్వీ షా వంటి ఆటగాళ్ల రికార్డుల సరసన చేరుతున్నాడు. పడిక్కల్ క్లాసిక్ బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే ప్రత్యర్థి జట్టుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దేవదత్ పడిక్కల్ కేవలం ఈ టోర్నీలోనే కాదు, ఓవరాల్‌గా లిస్ట్-ఏ (వన్డే ఫార్మాట్) క్రికెట్‌లో భీభత్సమైన రికార్డు కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 37 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 13 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు బాదాడు. అంటే ఆడిన ప్రతి మూడు ఇన్నింగ్స్‌ల్లో ఒక సెంచరీ చేస్తున్నాడన్నమాట. ఆయన బ్యాటింగ్ సగటు 80 కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇంతటి కన్సిస్టెన్సీ ఏ ఇతర యువ ఆటగాడిలోనూ కనిపించడం లేదు. అందుకే ఆయనను టీమ్ ఇండియాలో చేర్చుకోవాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. దీనికోసం బీసీసీఐ సెలక్టర్లు త్వరలోనే జట్టును ప్రకటించబోతున్నారు. వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అనారోగ్యం, ఇతర సీనియర్ల విశ్రాంతి వంటి కారణాల వల్ల పడిక్కల్‌కు ఓపెనర్‌గా లేదా మూడో నంబర్‌లో అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉంది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న ఈ కుర్రాడికి ఇప్పుడు అవకాశం ఇవ్వకపోతే అన్యాయం చేసినట్టే అని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# మన శంకరవరప్రసాద్ గారు కౌంట్‌డౌన్ పోస్టర్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.

# గ్లామర్‌తో కట్టిపడేస్తున్న కేతికా శర్మ..

ఈ మధ్యకాలంలో కాస్త సమయం దొరికితే చాలు హీరోయిన్స్ వెకేషన్ కి వెళ్తున్నారు. కొంతమంది ఫ్యామిలీతో వెళ్తే మరికొంతమంది సింగిల్ గా వెళ్లి తమ సమయాన్ని ఎంజాయ్ చేస్తూ ఉంటారు. ఇంకొంతమంది ఫ్రెండ్స్ తో వెళ్తూ అక్కడి వీధులు చుట్టేస్తూ మరింత ఆనందాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు చాలామంది షిప్ ప్రయాణం చేస్తూ అక్కడే తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరో బ్యూటీ కూడా షిప్ లో ప్రయాణిస్తూ తన అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను ఉక్కిరిబిక్కిరి చేసింది. తన అందాలతో కుర్రాళ్లకు గాలం వేస్తూ చెమటలు పట్టించింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ బ్యూటీ కేతిక శర్మ. తాజాగా వెకేషన్ కి వెళ్ళిన ఈమె సముద్ర యానం చేస్తూ షిప్ నుండి కొన్ని ఫోటోలను ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అందులో ఈమె షేర్ చేసిన ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమ్మడి అందాలకు ఫిదా అవుతున్నారు. చాలా రోజుల తర్వాత కేతిక శర్మ మంచి గ్లామర్ ట్రీట్ ఇచ్చిందని కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేతిక శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేస్తున్నాయి. చాలా రోజుల తర్వాత కేతిక ఇలా అందాలు ఆరబోయడంతో కామెంట్ బాక్స్ లో అభిమానులు ఫైర్ ఎమోజీలతో నింపేస్తున్నారు. 1995 డిసెంబర్ 24న ఇండియాలోని న్యూఢిల్లీలో జన్మించిన ఈమె చదువు పూర్తి అయిన తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ డబ్స్ మాష్ వీడియోల ద్వారా సోషల్ మీడియాలో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. ఈ వీడియోలతోనే దర్శకుల కంట్లో పడి కెరియర్ ను మొదలుపెట్టింది .తొలిసారి 2021లో పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరీ హీరోగా నటించిన రొమాంటిక్ అనే సినిమాలో హీరోయిన్గా అవకాశం దక్కించుకొని.. నటన రంగ ప్రవేశం చేసింది. ఈమె నటనపై విమర్శకులు ప్రశంసలు కురిపించడమే కాకుండా ఆశాజనకంగా నటించింది అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.




# రజనీతో కమల్ మూవీ

## డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.


# చైతన్యరావు దిల్ దియా మూవీ పోస్టర్ విడుదల




కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రియాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

# గందరగోళంలోకి నెట్టేసిన శ్రద్ధా

'సాహో' చిత్రంతో తెలుగు వారికి సుపరిచితమైన నటి శ్రద్ధా కపూర్. తనదైన అందం, నట ప్రతిభతో యువహృదయాలను గెలుచుకున్న ఈ బ్యూటీని ఆరాధించని బోయ్స్ లేరంటే అతిశయోక్తి కాదు. శ్రద్ధా ఇటీవల స్త్రీ2 లోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. హారర్ సినిమాలో శ్రద్ధా నటనకు మంచి మార్కులే పడ్డాయి. తదుపరి క్రిష్ 4లోను శ్రద్ధా కపూర్ నటించనుంది. ఇక శ్రద్ధా నిరంతర ఇన్ స్టా పోస్టులు ఇంటర్నెట్ లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. ఈ భామ తాజాగా పింక్ ఫ్రాక్ ధరించిన ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి, దాంతో పాటే ఒక కొటేషన్ కూడా ఇచ్చింది. "గులాబ్ అంటే గులాబీ, గులాబీలు ఎరుపు, ఎరుపు అంటే లాల్, కానీ గులాబీ అంటే పింక్? సరైన గందరగోళం" అని ఒక కవితను రాసింది. అయితే ఈ కవిత్వం పాఠకుల్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. శ్రద్ధాను సోషల్ మీడియాల్లో అనుసరిస్తున్న లక్షలాది మంది కన్ఫ్యూజన్ లోకి వెళ్లిపోయారు. ఈ రంగు-పద విరుద్ధతను హైలైట్ చేసిన విధానం ఆకర్షణీయంగా ఉన్నా, శ్రద్ధా లోతైన పరిభాషను అర్థం చేసుకోవడం కుర్రాళ్ల వల్ల కాలేదు. 'గులాబ్' అనే పువ్వుకు మూలం రోజ్. చాలా గులాబీలు ఎరుపు రంగులో ఉంటాయి... అని కూడా ఇందులో వివరంగా ఉంది. అయితే శ్రద్ధా విసిరిన పజిల్‌ను పూరించడానికి ప్రయత్నించిన అభిమానులు ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు. శ్రద్ధా 9.3 కోట్ల మంది ఫాలోవర్లతో భారతీయ చిత్రపరిశ్రమలో క్రేజీ హీరోయిన్ గా వెలిగిపోతోంది. ఈ పోస్ట్ చేసిన మొదటి 60 నిమిషాల్లోనే 10,000 కంటే ఎక్కువ కామెంట్లు వినిపించాయి. ఈ పోస్ట్‌కి సోషల్ మీడియాల్లో ఫ్యాన్స్ ఛమత్కారంగా స్పందించారు. శ్రద్ధ మాత్రమే భాషా సంక్షోభాన్ని ఇంత సౌందర్యంగా కనిపించేలా చేయగలదు! అని ఒకరు రాసారు. చాలామంది ఆమె 'స్త్రీ' వ్యక్తిత్వాన్ని ప్రస్తావించారు. గులాబీ-గులాబీ తర్కం కంటే ఓ 'స్త్రీ' రహస్యాన్ని కనుగొనడం సులభం అని కొందరు సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తానికి శ్రద్ధా ఫజిల్ తాలూకా గందరగోళం నుంచి బయటపడటం ఎవరి వల్లా కాలేదు!





Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463